## కథ




ఇంకా పొరలు పొరలుగా మసక వెలుతురు కురుస్తూనే వుంది.... అందు స్నానిస్తూనే వున్నా... వుండుండి గుబులు.... అత్తయ్య వేడి వేడి నీళ్ళు తోడుతోంది నాకై.... అబ్బ... ఈ చలిలో వేణ్ణీళ్లైనా చలే కదా ! తిప్పలు పడి... స్నానం కానిచ్చా. అక్కడైతే... ఏడు గంటల దాకా లేచే ప్రశ్నేలేదు మరి ! అంతలో జడవేయటం.. యిన్ని జాజులు తురమటం.. ఇంతవరకూ ఒక ఎత్తు.. నురుగుతో ఫిల్టర్ కాఫీ.. నిజ్జంగా.... యింత చలిలో... ఈ వేకువనే వేడి కాఫీ.... చిక్కగా గొంతులో జారుతుంటే..అత్తయ్య ఆత్మీయ తంత బాగుంది.. ఆమె మురిపెమంత బాగుంది. ఒక్కసారిగా ఈ వూరు వచ్చిన విషయం గుర్తుకు వచ్చి నా గుబులోత్సాహ మంతా 'ఉష్' అనిపించింది. అటుగా రాఘవ వస్తూ కనిపించాడు.దగ్గరిగా వస్తూనే... చెవిలో 'వుఫ్' అనివూది..బావిదగ్గర స్నానానికి వెళ్లాడు. ఏమిటీ చిలిపితనం ! ఏమీ తెలియ నట్లే వుంటాడు.కనీసం తాకనుకూడా తాకడు. శృతి తెలియని.. ఊహూ... శృతి మించని ఈ చిన్ని సరసాలు... అబ్బ ! ఇతన్ని నేనెలా పోగొట్టుకుంటాను? ఈ స్వాతిచినుకుని..ఆ మురికి కూపంలోకి లాగి... నా వల్ల కాదు.

"నీవు రావయ్యా పట్నానికి... ఆ పల్లెలో ఏం ఉద్ధరిస్తావ్" అని ఇదివరలో తానంటే... చిరునవ్వుతో మాట దాటవేశాడే గాని... ఉలుకూ... పలుకూ వుండదు. ఎంతో నిరాడంబరంగా వుండే రాఘవని... ఓ గొప్ప సర్జన్ అంటే నమ్మరు ముందుగా... ఏవైనా... క్లిష్టమైన కేసులప్పుడు పట్నం నుంచి యితనికి కబురు వస్తుంటుంది. నాన్నగార్కి... తన బాల్యమిత్రుడి కొడుకును... అల్లుడిగా చేసికొని... ఇల్లరికం తెచ్చుకొని... ఓ పెద్ద హాస్పిటల్ కట్టించి... ఓ ప్రయోజకుణ్ణి (?) చేయాలని ఆరాటం.

# చిన్ని అలను నేను !!

సి. హెచ్. సువర్చల

ఈ మండువా లోగిలి.. మల్లెపందరి.. బావినీళ్ళు..వేపచెట్టు గాలి..గోధూళి.. స్వచ్ఛమైన వెలుతురు.. ఆరోగ్యవాతావరణం.. ఆహ్లాదపరిచే పిల్లగాలులు.. రాగద్వేషాల అమాయక ప్రజలు.. వీళ్ల బాగోగులు.. ఈ మామిడి.. జామతోటలు.. పంటపొలాలు.. వాటి పచ్చదనానికై నిత్యం ఆరాటపడే ప్రజలు.. వారి లాభనష్టాలు.. వారి చదువు సంధ్యలు.. యివన్నీ ఎందుకింత ఆకర్షించాయో.. ఆరాటపడేలా చేశాయో... అన్న ఆశ్చర్యం పటాపంచలైంది. నాతోబాటు లాక్కెళదామన్న ఆలోచన మారి.. నేనూ వుండిపోదామన్న నిర్ణయం... పైగా... నా తల్లిదండ్రులకి సర్దిచెప్పగలనన్న స్థైర్యాన్ని చేకూర్చటంతో ... తృప్తిగా నిట్టూర్చాను.

నాకు రాఘవ కావాలి. రాఘవతో పాటు వాళ్ళమ్మా, నాన్నా, చెల్లెలూ, తమ్ముడూ... బాధ్యతలూ.. ఈ ఊరు.. ఈ వాతావరణం.. పల్లెలో బాగోగులు చూడాలన్న రాఘవ ఆశయం... అన్నీ కావాలి. నా స్వార్థంతో ఓ మంచి పనిని సమూలంగా ధ్వంసం చేయటమా? ఊహూ.. మళ్లీ ఆ క్రోటన్ ప్రపంచంలోకి రాఘవనే కాదు.. నేనూ అడుగుపెట్టను. ఆ శబ్దకాలుష్య వాతావరణంలో పాతికేళ్లకే మసిబారిపోతాయి.. మనసులూ.. శరీరాలూ.

"రామా..నీదయ రాదా" అని యిప్పటిదాకా... ఆలపించిన నాకు..." నిధి చాలా సుఖమా... రాముని సన్నిధి సుఖమా...." కీర్తన గుర్తొచ్చింది.

అరె.. రాఘవ చన్నీళ్లే స్నానం చేస్తున్నాడు.. బావి గట్టు దగ్గరకి అప్రయత్నంగా నడిచాను.. తోడి పెట్టుకున్న బకెట్ నీళ్లు... అతనిపై జల్లులుగా పోశాను.. అతనికి తోడుగా... నేనూనూ.

అప్పుడే తెలవారింది. నన్నూ ఆవరించిన మసక వెలుతురు మాయమై... పూర్తిగా వెలుగు వచ్చేసింది.

"నేను వృథాగా గడిపిన కాలాన్ని తలచుకొని... పనిలేని రోజుల్లో... సోమరిపోతుగా చింతించాను. కానీ... కాలం ఎన్నడూ వృథా కాదు... ప్రభూ ! నీ జీవితంలో... ప్రతి క్షణాన్నీ... నువ్వు.. నీ చేతుల్లోకి తీసుకొన్నావు... పొద్దున్నే లేచి... పుష్పాలతో... నా తోటంతా నిండిన చిత్రాన్ని చూసి విస్తుపోయాను..."

రవీంద్రుని భావగీతి జ్ఞప్తికి వచ్చింది.

అవును మరి... రాఘవ తోడి జీవితంలో... అంత సౌరు వుంటుంది...

అందుకే... నా రాఘవ ఆశయాల సింధువులో.... చిన్ని అలను నేను !!

## హాట్సాఫ్ టు బర్ఖాదత్

టెలివిజన్ వార్తలను వినిపించడంలో మూడు పదులు దాటిన బర్ఖాదత్ అత్యంత వైవిధ్యాన్ని సృష్టించారు. ఎన్ డి టీవి మేనేజింగ్ ఎడిటర్ అయిన దత్ హృదయాలు స్పందించేలా ప్రతిభావంతంగా వీక్లీ న్యూస్ రిపోర్టింగ్ చేసి చరిత్రకెక్కారు. వారం వారం ఆ ఛానల్‌లో ప్రసారమయ్యే "ఉయ్ ద పీపుల్" అనే ఆమె కార్యక్రమాన్ని ఒక్కసారి చూశారంటే ఇందులో వాస్తవం మీకు తెలుస్తుంది. 'నిజాన్ని కళ్ళకు కట్టినట్టు చెప్పడం' అంటే ఇలాగేనేమోనని ప్రేక్షకులకు అనిపించడం ఖాయం. కార్గిల్ యుద్ధం సమయంలో ఆమె నిష్పాక్షికంగా అందించిన సమాచారం కారణంగా ఆమె అందరికి దగ్గరైంది. ఆమెపేరు తెలియని ప్రేక్షకుడు లేడనటం అతిశయోక్తి కానేకాదు. ఆమె ప్రతిభకు నిదర్శనంగా అసంఖ్యాకంగా అవార్డులు ఆమెను వరించాయి.




"చుట్టూ బుల్లెట్‌లు రివ్వురివ్వున దూసుకుపోతుంటే యుద్ధరంగం నుంచి అక్కడి పరిస్థితిని విడమరచి చెప్పటమంటే ఎన్ని గుండెలుండాలి. అందునా మహిళకు ! వృత్తిపట్ల ఆమె నిబద్ధత ప్రశంసనీయం!! అన్నారు చలనచిత్ర గీతాకారుడు గుల్జార్.

## పంచరస

కవిత ఒక కృతి కళాకృతి
స్వర సమ్మేళనం
అందాల హరివిల్లు సుందరస్వప్నం
ఒక హితైషి ఒక భాండాగారం
అదే మమత అదే సమత
కవిత్వం కాలాన్ని మార్చుతుంది
గాయాల్ని మాన్పుతుంది !
జానపదం జాలువారి
గంధర్వులు సభ చేస్తారు
కింపురుషుల నాదం సాగుతుంది
చారిత్రకాలు చిందించిన రోషాగ్నులు
పౌరాణికాలు నెత్తికెత్తిన నీతిమూటలు
ఎలుగెత్తిన అసమానతలు
పాటలుగా పల్లవించిన కవిత
గాయకుడి గళంలో ఓ సంగతి !
నల్లబజారు దృశ్యాదృశ్యాలు
జీర్ణతృణాలపై భస్మాసుర హస్తాలు
స్పృశ్యా స్పృశ్యా చరితాలు
అహింసా హింసా వాదాలు
కథలు కళారూపాలుగా మారి
కవిత కదను తొక్కుతుంది
జనపథంలో జ్వలిస్తుంది !
పడమటి సంధ్యారాగంలో
చెంగావి మేఘమాలికల దుఃఖాలు
అడవి గాచిన వెన్నెల నీడలు
ఎడారి డొక్కల అస్థిపంజరాలు
నింగిలో తేలాడే పక్షుల వలయాలు
కవిత తన కుంచెతో
చిత్రించిన చిత్రాలు
బింబానికి ప్రతిబింబాలు !
కవిత ఒక సమూహం ఒక ప్రవాహం
ఒక సంకేతం ఒక సందేశం
కవిత పాతాళానికి భూమికి
పాకుడు రాయి
నేలకు నింగికి
ఆరోహణం !

- అడిగోపుల వెంకటరత్నమ్